దారులన్నీ కాషాయమయం


ర్యాలీలో కోలాటం ఆడుతున్న మహిళలు


నామినేషన్‌కు వెళ్లే ముందు గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్


ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

నామినేషన్ ర్యాలీకి బ్రహ్మరథం

- కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ నామినేషన్ దాఖలు
- భారీగా హాజరైన కార్యకర్తలు, అభిమానులు
- ప్రజలే నా బలం వారి ఆశీర్వాదంతో గెలుస్తానని వ్యాఖ్య

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ నామినేషన్ ర్యాలీ అట్టహాసంగా కొనసాగింది. గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కూన శ్రీశైలంగౌడ్ భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు తరలి వెళ్లారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొనడంతో ప్రధాన రోడ్లు కిక్కిరిసిపోయాయి. వేలాది బైక్‌ల ర్యాలీ నడుమ శ్రీశైలంగౌడ్ ర్యాలీ కొనసాగింది. మహిళలు కోలాటాలు, మంగళ హారతులతో బ్రహ్మరథం పట్టారు. రోడ్లన్నీ కాషాయమయం అయ్యాయి.

◆ **కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ ఒకటే...**

షాపూర్‌నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలే తన బలమని వారి ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ ఒకటేనని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన తర్వాత బీఆర్ఎస్‌లోకి వెళ్తారన్నారు.

◆ **భారీ గజమాలతో స్వాగతం...**

బీజేవైఎం నేతలు సాయిరామ్ రెడ్డి, ఓరుగంటి, అఖిల్, సాయి భారీ గజమాలతో స్వాగతం కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చౌద శ్రీనివాస్‌రావు, నాగిళ్ల శ్రీనివాస్‌లు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

◆ **ర్యాలీని అడ్డుకున్న పోలీసులు**

హెచ్‌ఎండీ రోడ్డులో పోలీసులు శ్రీశైలంగౌడ్ ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలకు పోలీసులకు వాగ్వాదం జరిగింది. కూన శ్రీశైలంగౌడ్‌తో పాటు మరికొంత మందిని అనుమతించడంతో గొడవ సద్దుమణిగింది.

◆ **పాల్గొన్న కర్ణాటక మాజీ మంత్రులు**

ఈ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న కర్ణాటక మాజీ ఆరోగ్య శాఖమంత్రి డాక్టర్ సుధాకర్, కర్ణాటక ఎమ్మెల్యే రామచంద్రగౌడ, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ధీమాలో కమలదళం


కూన శ్రీశైలంగౌడ్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు


బీఆర్ఎస్ నేతలు చౌద శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తూ..


షాపూర్‌నగర్‌లో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న కూన


బీజేపీకి జేజేలు కొడుతున్న మనుమళ్లతో కూన శ్రీశైలంగౌడ్



చివరి రోజు 23 మంది నామినేషన్లు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో శుక్రవారం పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో పాటు మొత్తం 23 మంది 52 సెట్ల నామినేషన్‌లు వేసినట్లు కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు. పది మంది ఇండిపెండెంట్లతో పాటు బీఆర్ఎస్ నుంచి వివేకానంద్ తరఫున రెండు జతల పత్రాలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, విద్యార్థుల రాజకీయ పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, ఎంసీపీఐ, ఏఐహెచ్‌సీపీ, యుగ తులసి పార్టీ, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ, అలయెన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫామ్స్ పార్టీ తరఫున అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు.

జంగ్ 2023 తెలంగాణ

బీజేపీకే మా మద్దతు

తెలంగాణ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులు


బీజేపీకి మద్దతు తెలుపుతున్న కుత్బుల్లాపూర్ శాఖ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు

చింతల్: తెలంగాణ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉపాధ్యాయులకు మొండి చేయి చూపించిందని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కుత్బుల్లాపూర్ శాఖ సభ్యులు ఆరోపించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తరువాత కరువు భత్యం, పీఆర్‌సీ తదితర వంటి వాటిని కంటితుడుపు చర్యగా చూసిందన్నారు. అదే కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బీజేపీ పూర్తి స్థాయిలో రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన వాటినన్నింటి తమ తమ ఖాతాల్లో జమ జేసిందన్నారు. నేడు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలుపుతున్నామని అన్నారు. బీజేపీకి ప్రతి రిటైర్డ్ ఉద్యోగి మద్దతు తెలుపుతూ... కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి బాలచంద్రం, కుత్బుల్లాపూర్ శాఖ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దశరద రామశర్మ, కార్యదర్శి ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్ రావు, సలహదారు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విధిగా ఓటు వేయాలి

శేరిలింగంపల్లి సహాయ రిటర్నింగ్ అధికారి సుస్మిత

రాయదుర్గం: తాము ఓటు వేస్తూ ఇతరులు కూడా ఓటేసేలా చూడాలని శేరిలింగంపల్లి సహాయ రిటర్నింగ్ అధికారి సుస్మిత సూచించారు. రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులు ఓటింగ్ ప్రాముఖ్యత, వినియోగంపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు పౌరులందరికీ ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. తాము ఓటు వేస్తామని, తమ తోటివారు, ఇంట్లోని, పరిసరాల్లోని వారంతా ఓటు వేసేలా చూస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ ఎస్ ఇక్బాల్‌హుస్సేన్, అధ్యాపకురాలు అరుణకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నోడల్ అధికారులు ఉషారాణి, మల్లేశ్వరి, జీహెచ్‌ఎంసీ అధికారులు, జీఐఎల్‌టీ అధ్యాపకులు పాల్గొన్నారు.

లోకాయుక్త పటిష్టంతో అవినీతి మాయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో లోకాయుక్తను పటిష్టం చేయడంతో పాటు పూర్తి అధికారాలను బదలాయిస్తే అవినీతిని సమూలంగా రూపుమాపే అవకాశం ఉంటుందని రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో పౌర కేంద్రీకృత పాలన పారదర్శకత-అవశ్యకత-సవాళ్లు, సంస్కరణలు అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సుకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. లోకాయుక్త పటిష్టంగా ఉంటేనే అవినీతి తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జస్టిస్ కళార్చనబోగి మాట్లాడుతూ కరోనా సమయంలో న్యాయవ్యవస్థలో తీసుకొచ్చిన ఈ-జస్టిస్ విధానం బాగుందన్నారు.

ఓయూ-జేఎన్‌టీయూహెచ్ ఒప్పందం

లాలాపేట: ప్రీ-ఇంక్యుబేషన్, ఇంక్యుబేషన్, యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేసిన ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్(ఓటీబీఐ), జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలు (జెఎన్‌టీయూహెచ్) పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నారు. శుక్రవారం ఓయూలో జరిగిన సమావేశంలో ఓటీబీఐ సీఈఓ డాక్టర్ ఆర్ హాఫీజ్ బాషా, జేటీబీఐ ప్రోగ్రాం మేనేజర్ స్వాతి ఆనందం సమక్షంలో ప్రొ.ఇ. విద్యాసాగర్, ప్రొఫెసర్ ఎం. ఆశారాణి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు దరఖాస్తు ఫారాలను సమష్టిగా పంపిణీ చేయడం, సమర్పించిన ప్రతిపాదనలను మూల్యాంకనం చేయడానికి ఓటీబీఐ, జేటీబీఐలు కలిసి స్క్రీనింగ్ కమిటీని రూపొందించడానికి కలిసి పని చేస్తాయని యూనివర్సిటీ అధికారులు పేర్కొన్నారు. ఈ రెండు యూనివర్సిటీల టీబీఐలు ఎంచుకున్న స్టార్టప్‌లకు మార్గ దర్శకత్వం, నెట్వర్కింగ్, నిధుల అవకాశాలను అందిస్తాయన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు


ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏసీపీ

సుభాష్‌నగర్: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ శుక్రవారం నామినేషన్ వేసిన నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ముందస్తుగా ఉదయం బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు నేతృత్వంలో షాపూర్‌నగర్‌లోని ట్రాఫిక్ పోలీసులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. నామినేషన్ వేయడానికి కూన శ్రీశైలంగౌడ్ భారీ బైక్ ర్యాలీ రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా గాజులరామారం, షాపూర్‌నగర్‌ల మధ్య వాహనాలను మధ్యాహ్నం వరకు దారి మళ్లించారు.

కూల్చడంలో ఉన్న శ్రద్ధ.. నిర్మించడంలో చూపడం లేదు!

రంగారెడ్డినగర్: బస్టాప్‌లను కూల్చడంలో చూపుతున్న శ్రద్ధ వాటిని తిరిగి నిర్మించడంలో చూపడం లేదు సర్కిల్ అధికారులు.. దీంతో బస్టాప్ ప్రాంతం అక్రమణలకు గురవుతున్నాయి.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట- ఐడీపీఎల్ రోడ్డులో ఉన్న రంగారెడ్డినగర్ ఆర్టీసీ బస్టాప్‌ను సర్కిల్ అధికారులు నూతన బస్టాప్ ఏర్పాటు చేసేందుకు నెల రోజుల క్రితం కూల్చివేశారు. దీంతో స్థానికంగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే జనం ఎండలో నిలుచోలేక ఇబ్బందులకు గురవుతున్నారు. అంతే కాకుండా ఇప్పటికే బస్టాప్‌ను ఆనుకుని అటు ఇటుగా పలువురు డబ్బాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

◆ అధికారులు కొత్త బస్టాప్‌ను నిర్మించడంలో మరింత ఆలస్యం చేసినట్లయితే బస్టాప్ ప్రాంతంలో మరిన్ని డబ్బాలు ఏర్పాటు చేసే అవకాశం లేకపోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే బస్టాప్ ప్రాంతంలో పక్కనే ఉన్న మెకానిక్ షెడ్డు నిర్వాహకుడు ఆటోలను నిలుపుతూ ప్రయాణికులక ఇబ్బందులు సృష్టిస్తున్నాడు. గత సంవత్సరం గాంధీనగర్ బస్టాండ్‌ను ఇదే తరహాలో కూల్చివేసిన సర్కిల్ అధికారులు ఆపై పత్తా లేకుండా పోయారు. దీంతో రంగారెడ్డినగర్ బస్టాండ్ సైతం అదే కోవలో కనుమరుగు కానుందా అని స్థానికంగా చర్చానీయంశమైంది.


జగద్గిరిగుట్ట-ఐడీపీఎల్ రోడ్డులో కూల్చివేసిన రంగారెడ్డినగర్ బస్టాండ్


రంగారెడ్డినగర్ బస్టాండ్‌కు ఆనుకుని ఏర్పాటు చేసిన డబ్బాలు


మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన డాక్టర్ సాంబశివరావు. చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్, ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు


బీఆర్ఎస్‌లో చేరిన రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన ఎంబీ షాకీర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే వివేకానంద్

హ్యాట్రిక్ సాధించడం ఖాయం

ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన జంట సర్కిళ్లలో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తూ గత తొమ్మిదేళ్లుగా నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలు నమ్మొద్దని సీఎం కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమన్నారు.

పార్టీలో చేరికలు..

రంగారెడ్డినగర్ డివిజన్ ఐడీపీఎల్‌లోని సౌజన్య హాస్పిటల్ డాక్టర్ సాంబశివరావు ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ కుత్బుల్లాపూర్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. కేసీఆర్ విధానాలను నచ్చడంతోనే పార్టీలో చేరానని సాంబశివరావు తెలిపారు. అదే విధంగా రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన ఎండి షాకీర్ బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు.

◆ చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ బీఆర్‌టీయూ అధ్యక్షులు ఇస్మాయిల్, జనరల్ సెక్రటరీ సత్యం ప్రసాద్‌ల ఆధ్వర్యంలో బీఆర్‌టీయూ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పేదలకు, కార్మికులకు అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు.

◆ ఎమ్మెల్యే కేపీ వివేకానంద కార్మికుల క్షేమం కోరే వ్యక్తి అని, కార్మికులకు ఎల్ఓసీ, సీఎం రిలీఫ్ ఫండ్‌లు అందజేశారని, ఆయన హ్యాట్రిక్ విజయాన్ని తెచ్చి పెట్టే బాధ్యత మనందరిపై ఉందన్నారు. మేడ్చల్ జిల్లా ప్రెసిడెంట్ ప్రభాకర్, జనరల్ సెక్రటరీ ప్రదీప్‌సింగ్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మన్నె గోపాల్, రాజు, ఖదీర్, రాజయ్య, లారీ డ్రైవర్ యూనియన్ ఆర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్

కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: ఇటీవలే తెలంగాణ టీడీపీ అధ్యక్షుడి పదవికి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ రాజీనామా చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్‌లో కేపీ వివేకానంద్ విజయానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.




చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశమైన బీఆర్‌టీయూ అనుబంధ కమిటీల సభ్యులు


సూరారం డివిజన్‌లో ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

విజ్ఞాన్ బో ట్రీ స్కూల్‌కు ఓవరాల్ టైటిల్

సాక్షి, హైదరాబాద్: స్పోర్ట్స్ ఫర్ ఆల్ (ఎఫ్ఎఫ్ఏ) ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో నిజాంపేటకు చెందిన విజ్ఞాన్ బో ట్రీ స్కూల్ ఓవరాల్ టైటిల్‌ను సాధించింది. హైదరాబాద్‌లో శుక్రవారం ముగిసిన ఈ క్రీడల్లో విజ్ఞాన్ బో ట్రీ స్కూల్ 21 స్వర్ణాలు, 19 రజతాలు, 28 కాంస్యాలతో కలిపి మొత్తం 58 పతకాలు సొంతం చేసుకొని 332 పాయింట్లతో విజ్ఞాన్ బో అగ్రస్థానంలో నిలిచింది. విజ్ఞాన్ బో ట్రీ స్కూల్ విద్యార్థులు స్కేటింగ్‌లో అత్యధికంగా ఆరు స్వర్ణాలు, అథ్లెటిక్స్‌లో నాలుగు బంగారు పతకాలు గెల్చుకున్నారు.సన్‌ఫ్లవర్ వేదిక్ స్కూల్ (మేడ్చల్) రెండో స్థానంలో, చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ మూడో స్థానంలో నిలిచాయి.

మృతుడి రాజు కుటుంబానికి అండగా ఉంటాం


కార్మికుడు రాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా బీఆర్ఎస్‌కేవీ పని చేస్తుందని శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. బయో కెమికల్ పరిశ్రమంలో పని చేస్తున్న రాజు అనే కార్మికుడు ఆరోగ్య సమస్యతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మదన్‌గౌడ్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి రాజు కుటుంబానికి చేయూతను అందిస్తామన్నారు. ఏ సహాయం కావాలన్నా తాను ముందుంటానని హామీ ఇచ్చారు.

ఆర్చరీలో సత్తాచాటిన శాన్వి


ఆర్చరీలో సిల్వర్ మెడల్ సాధించిన శాన్వి

కుత్బుల్లాపూర్: క్రీడల్లో రాణిస్తూ వస్తున్న తత్వ గ్లోబల్ స్కూల్ విద్యార్థిని శాన్వి రానున్న రోజుల్లో మరింత రాణించాలని తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం ఆకాంక్షించారు. గచ్చిబౌలిలో జరిగిన ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్ పోటీలో శాన్వి పాల్గొని అండర్-10 విభాగంలో రాణించి ఆర్చరీలో సిల్వర్ మెడల్ సాధించింది. మొత్తం 700 స్కూల్ నుంచి విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో తనదైన శైలిలో రాణించి మెడల్స్ అంతం చేసుకుంది.

తోపుడు బండి అందజేత

సుభాష్‌నగర్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం చిత్తారమ్మ దేవినగర్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన శిబిరం, అన్నదానం, ఎస్పీఆర్ ట్రస్టు ద్వారా జీవనోపాధి నిమిత్తం ఒకరికి తోపుడు బండిని అందజేశారు. నియోజకవర్గం నుండి కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరై అతడికి శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎస్పీఆర్ ట్రస్టు ద్వారా తోపుడు బండిని అందిస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

ఇషాసింగ్‌కు ఘన సత్కారం



దుండిగల్: ఆసియా క్రీడల్లో ఒక స్వర్ణంతో పాటు నాలుగు పతకాలు సాధించిన భారత మహిళా షూటర్ ఇషాసింగ్‌ను ఎంఎల్ఆర్ఐటీ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలోని ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియాన్ని ఇషా సందర్శించి, అక్కడి టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్,అథ్లెటిక్స్, షూటింగ్, ఫెన్సింగ్ క్రీడాకారులతో సరదాగా ముచ్చటించింది. సందర్భంగా వర్ధమాన క్రీడాకారులు ఇషాను పలు విషయాలు అడిగి ఆటలో మెలకువలు తెలుసుకున్నారు. అనంతరం ఇషాను లక్ష్మణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ రాధిక కలిసి సన్మానించారు.



నరకాసుర వధ నృత్యరూపకంలో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్: దీపావళి పర్వదిన ఉత్సవాలు శుక్రవారం శంషీగూడలోని నారాయణ పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నరకాసుర వధ నృత్య రూపకం ఆకట్టుకుంది. పాఠశాలలో రంగవల్లికలతో రంగు రంగుల దీపాలు, అష్టలక్ష్మి బొమ్మల కొలువుతో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం వైజయంతి, ప్రధానోపాధ్యాయురాలు వసుప్రద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నార్త్ సిటీ హైస్కూల్‌లో..

సుభాష్‌నగర్: దీపావళి పండుగలో క్రాకర్స్ పేల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా జరిపారు. చిన్నారులు వివిధ వేషధారణలో నరకాసురవధ ఘట్టాన్ని, దీపావళి ప్రాముఖ్యతను నాటకం రూపకంగా వివరించారు. అనంతరం విద్యార్థులు వారి తల్లిదండ్రులకు టపాసులు పేల్చేటప్పుడు ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.


వివిధ వేషధారణల్లో నార్త్‌సిటీ హైస్కూల్ విద్యార్థులు